## క్లుప్తంగా

### ఎల్‌ఓసీ అందజేత



హుస్సేన్ కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: మండల పరిధి చరికొండ గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్ ఆరోగ్య సమస్యలతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో.. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్.. సమస్యను ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్సీ సహకారంతో, హుస్సేన్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2 లక్షల ఎల్‌ఓసీ చెక్కు మంజూరు కాగా.. సోమవారం నిమ్స్‌లో బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.

### 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు

తలకొండపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చిందని ఆ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదికి 2 కోట్ల కొలువులు ఇస్తామని చెప్పిన ప్రధాని మోదీ.. వాటి విషయం ఏమైందని ప్రశ్నించారు.

### కమ్యూనిస్టులపై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు

ఇబ్రహీంపట్నం రూరల్: కమ్యూనిస్టు పార్టీలపై బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్యలు అన్నారు. పోరాడాల్సిన కమ్యూనిస్టులు ఎక్కడా అని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. ఫార్మా భూములపై ఉద్యమించినప్పుడు మీరు ఏం ఒరగబెట్టారని, టాటా హక్కుల సమస్యల కోసం పోరాటం చేస్తే మీరు ఏం చేశారని కేటీఆర్‌ను ప్రశ్నించారు. యూనియన్ రిజిస్ట్రేషన్ చేయకుండా అడ్డుకున్నది మీ ప్రభుత్వం కాదా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రంగారెడ్డి జిల్లాలో అనుకూలమైన అధికారిని అడ్డం పెట్టుకుని దోచుకున్నది చాలా లేదా అని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా అధికార పార్టీని ప్రశ్నించడం మంచిదే కాని, కమ్యూనిస్టులను నిందించడం తగదని చెప్పారు. పోరాటాల గురించి కమ్యూనిస్టులకు చెప్పే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు.

### రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఆమనగల్లు: రక్తదానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని ఎస్‌ఐ వెంకటేశ్ అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు శాఖ, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఎస్‌ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన యువతీ యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. ప్రజల్లో రక్తదానంపై ఉన్న అపోహలను పోగొట్టడానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో 25 మంది రక్తదానం చేశారు. లయన్స్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాష, జిల్లా చైర్మన్‌లు రమేశ్, చంద్రశేఖర్, యాదయ్య, సభ్యులు మహేశ్, నర్సింహ, బాలకృష్ణ, కొండల్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

### అధికారం కోల్పోయాక గుర్తుకొచ్చామా?

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో అధికారం కోల్పోయాక మాజీ మంత్రి కేటీఆర్‌కు కమ్యూనిస్టులు గుర్తుకొచ్చారా అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.సామెల్ సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం మండలంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆదివారం నిర్వహించిన దసరా సమ్మేళనానికి హాజరైన కేటీఆర్.. తన ప్రసంగంలో పోరాడ వలసిన కమ్యూనిస్టులు ఎక్కడ అని ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. కమ్యూనిస్టుల పోరాటంతో సాధించుకున్న అసైన్డ్ తదితర భూములతో పేదలు జీవనోపాధి పొందుతుంటే.. ఎస్సీ,ఎస్టీ,బీసీ పేద రైతుల పేర్లను ధరణిలో తొలగించి, రైతుబంధు రాకుండా చేసింది మీ ప్రభుత్వమే కదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. దీంతో ఎంతో మంది పేద రైతులు ఆందోళనకు గురై.. మృత్యువాత పడితే రైతుబీమా కూడా నోచుకోలేని దుస్థితిని కల్పించింది కూడా మీ సర్కారేనని గుర్తుచేశారు. ఫార్మాసిటీ పేరుతో యాచారం, కందుకూరు మండలాల్లో 19 వేల ఎకరాల రైతుల భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొల్లగొడుతున్న సందర్భంలో రైతులకు అండగా.. నిలబడింది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. ఆరోపణలు చేసేముందు మీ తప్పులను తెలుసుకోవాలని కేటీఆర్‌కు సూచించారు.

# పూలతోట.. సిరుల బాట



చాదర్‌పల్లిలో బంతిపూల తోట

ఉద్యాన పంటల సాగుకు జిల్లాలోని నేలలు అనుకూలంగా ఉన్నాయి. ముఖ్యంగా పూల సాగు. పూల తోటల సాగులో ఎక్కువ కాలం వాడిపోకుండా రవాణా, నిలువ చేసుకునే వీలున్న బంతి, చామంతి, మల్లే, గులాబీ తదితర వాటిసాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. సిరుల పంట పండించుకుంటున్నారు. తోటల పెంపకానికి మరింత మంది ముందుకు వస్తున్నారు.

- బంతిసాగుతో అధిక లాభాలు
- దీపావళి, కార్తీకమాసంలో డిమాండ్
- స్వల్పకాలంలో అధిక రాబడి పొందుతున్న రైతులు
- తోటల పెంపకానికి ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

యాచారం: పూల సాగుపై అన్నదాతలు మక్కువ చూపుతున్నారు. తక్కువ పెట్టుబడి, శ్రమలేకుండా.. స్వల్పకాలంలోనే అధిక లాభాలు తెచ్చిపెట్టే పూల తోటలను అధికంగా సాగుచేస్తున్నారు. మహానగరానికి చుట్టూ విస్తరించి ఉన్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల, కల్వకుర్తి నియోజకవర్గాల్లో వందలాది ఎకరాల్లో రైతులు బంతి, చామంతి, కనకాంబరాలు, మల్లేపూలు, గులాబీ ఇలా పలు రకాల పూల తోటలను పెంచుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో వెయ్యి ఎకరాల వరకు తోటలు పెంపకం కొనసాగుతోంది.



గునుగల్‌లో..

#### తోటలవద్దకు వ్యాపారులు

పూల తోటల పెంపకంలో పెట్టుబడి ఎంత పెట్టినప్పటికీ.. డిమాండ్‌ను బట్టి లాభాలు అధికంగా ఉంటాయి. కొన్ని సార్లు నష్టాలు తప్పవు. కొన్ని రకాల తోటలు స్వల్పకాలంలోనే చేతికి వస్తే.. మరికొన్ని ఏళ్లకొద్ది సమయం తీసుకుంటాయి. రాష్ట్ర రాజధానికి చేరువలో ఉండటంతో రైతులు ఉదయాన్నే నగరంలోని మార్కెట్లకు పూలను తరలించి విక్రయిస్తుంటారు. కొందరు వ్యాపారులు ముందస్తు సమాచారంతో తోటల వద్దకు వచ్చి పూలను భారీగా కొనుగోలు చేస్తారు.

#### డిమాండ్‌ను బట్టి సాగు..

కొద్ది రోజుల్లో పంట దిగబడులు చేతికి వచ్చే అవకాశం ఉంది. రైతులు కూడా మార్కెట్లో డిమాండ్‌ను బట్టి పూల తోటలను సాగు చేయడం అలవాటు చేసుకున్నారు. అందులో భాగంగానే మరో పది రోజుల్లో వచ్చే దీపావళి పండుగకు బంతి, చామంతి పూలు చేతికొచ్చే అవకాశం ఉంది. ఈ వేడుకకు అత్యధికంగా బంతిని వినియోగిస్తుంటారు. అందుకే డిమాండ్ బాగా ఉంటుంది. నవంబర్ 2 నుంచి కార్తీకమాసం ప్రారంభం కానుంది. అయ్యప్ప దీక్షల సమయం కావడంతో సుమారు 45 రోజుల పాటు పూజలు జరుగుతూనే ఉంటాయి.

#### బంతికి భలేక్రేజీ

యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల తదితర మండలాల్లో బంతిని సాగు చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురవడంతో వ్యవసాయ పొలాల్లోనే నాటువేసిన పంట, నేడు పూలతో కళకళలాడుతోంది. పండుగల ప్రారంభంతో పూలను కోసి మార్కెట్‌కు తరలించి, మంచి లాభాలు పొందేందుకు రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. వినాయకచవితి, బోనాలు, దసరా పండుగలకు పూలను విక్రయించి మంచి లాభాలు పొందారు. బంతిపూల ధర కిలోకు రూ.100 నుంచి రూ.150 వరకు పలకగా, మిగతా రకాలు రూ.50 నుంచి రూ.200లకు పైగానే డిమాండ్ ఉంది.

#### రూ.50 వేల పెట్టుబడితో..



ముప్పై గుంటల వ్యవసాయ భూమిలో రూ.50 వేల పెట్టుబడితో బంతిపూలు సాగు చేశాను. మరో కొద్ది రోజుల్లో పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. దీపావళి, కార్తీక మాసానికి పుష్పాలకు డిమాండ్ ఉంటుంది. కిలోకు రూ.100 నుంచి రూ.150కి పైగా ధర పలికే అవకాశం ఉంది. పూలు కావాల్సిన వారు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటాం.

–ఎస్.శ్రీశైలం, రైతు, చౌదర్‌పల్లి

#### దీపావళి అంటేనే పూలకు ప్రాధాన్యం



దీపావళి పండుగ పూలకు ప్రాధాన్యం. దివ్వెల ఉత్సవం వచ్చిందంటే ఇంట్లో వ్రతాలు, దుకాణాల్లో లక్ష్మీపూజ కోసం కిలోల కొద్ది బంతిపూలను వినియోగించాల్సి ఉంటుంది. ధర చూసేది లేదు. అవసరమైన కొద్దీ పూలను కొనుగోలు చేస్తాం. కార్తీక మాసంలోనూ చాలా ఉపయోగిస్తుంటాం.

–తలారి మల్లేశ్, స్టీల్, సిమెంట్ వ్యాపారి, యాచారం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- రూ.300 కోట్లకు పైగా నిధులు మంజూరు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మహిళలకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కడ్తాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ ముంతాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 64 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

#### పది నెలల కాలంలో..

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్, రూ.500లకు వంట గ్యాస్, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీని పెంచిందని వెల్లడించారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా పథకాలతో రైతులకు అండగా నిలిచిందని తెలిపారు. పది నెలల కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.300 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించానని వెల్లడించారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

#### అభివృద్ధి చూసి ఓర్వని జైపాల్

ఏ పార్టీలో ఉన్నా ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసమే పనిచేశానని, అది చూసి ఓర్వలేని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన మూడు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా ఉండి చేయని అభివృద్ధి పనులను.. కేవలం 10 నెలల్లోనే చేశానని, ఇంకా చేస్తానని కసిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువ పనులు ప్రారంభం

ఆమనగల్లు: పట్టణంలోని 15వ వార్డు పరిధి ఉదయనగర్ కాలనీలో మురుగు కాలువ నిర్మాణ పనులను సోమవారం కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. వార్డు పరిధిలో ఇప్పటికే సీసీరోడ్లు, మురుగు కాలువలు నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి మంజూరైన రూ.60 లక్షలతో నూతనంగా మురుగు కాలువ నిర్మాణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మోయిన్, షర్ఫుద్దీన్, కాలనీ వాసులు రాజు, సాయమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ లక్ష్మణ్

## కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేవాలి

వ్యాపారులకు కేటాయించాలి: మాజీ ప్రజాప్రతినిధులు



అమిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

కడ్తాల్: తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేవాలని మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ కోరారు. అనంతరం వ్యాపారులకు కేటాయించాలన్నారు. సోమవారం హైదరాబాద్ సమాఖ్య ప్రధాన కార్యాలయంలో వారు టీఎస్‌డీడీసీఎఫ్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ.. 2022లో నాటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో దుకాణ సముదాయం పూర్తయిందని, అయినప్పటికీ ప్రారంభించక పోవడంతో కాంప్లెక్ వృథాగా ఉందని తెలిపారు. వినియోగంలోకి తెచ్చి వ్యాపారులకు కేటాయిస్తే.. ఏటా రూ.12 లక్షల నుంచి 15 లక్షల వరకు అద్దె రూపంలో డెయిరీ సంస్థకు ఆదాయం సమకూరేదని వివరించారు. వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాడి రైతులకు సకాలంలో పాల బిల్లులు అందించేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో ప్రశాంత్ నాయక్, చెన్న వెంకటేశ్ ఉన్నారు.

## పశువులకు గాలికుంటు టీకా తప్పనిసరి



ఆవుకు టీకా ఇస్తున్న డాక్టర్ అగ్నివేష్

ఆమనగల్లు: పాడి పశువులకు రైతులు విధిగా గాలికుంటు నివారణ టీకాలు ఇప్పించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ అగ్నివేష్ అన్నారు. మండల పరిధి పోలెపల్లి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం 326 ఆవులు, 12 పాడి పశువులకు టీకాలు ఇచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సులేమాన్, యాదయ్య, బురానొద్దీన్, పాలాక్ష, గోపాలమిత్రలు హరీశ్, రమేశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులను దగా చేసిన ప్రభుత్వం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మాడ్గుల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్ రెడ్డి ఆరోపించారు. సోమవారం వారు అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ రైతుభరోసా ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. భరోసాతో పాటు అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లాలయ్య గౌడ్, జైపాల్ నాయక్, శంకర్ నాయక్, పవన్ కుమార్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, యాదయ్య, విజయ్, శివ, అల్లాజీ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

యాచారం: స్నేహితురాలి కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. ఆర్థిక సహాయం అందజేసి మేమున్నామని భరోసా కల్పించారు. మండల పరిధి నందివనపర్తి ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి బ్యాచ్‌నకు చెందిన జలజ భర్త నందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న జలజ.. చిననాటి స్నేహితులు సోమవారం రూ.50 వేలను ఆమెకు అందజేశారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థి దశ నుంచే చిన్నారులకు చట్టాలపై అవగాహన అవసరమని ఆదిబట్ల మున్సిపాలిటీ సీఐ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఠాణా ఆవరణంలో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు.. సీఐ చట్టాలపై, పోలీసులు విధుల గురించి అవగాహన కల్పించారు. లాకప్, హాండ్‌క్యాప్స్ చూపించారు. కేసుల నమోదు, జీడీఎంట్రీ, ఎఫ్ఐఆర్‌తో పాటు క్రైం వివరాల గురించి వివరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. నేరం చేసిన వారు ఎంతటి వారైనా.. ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్, ఏఎస్‌ఐలు యాదయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



బేడీల గురించి వివరిస్తున్న సీఐ

## నాణ్యమైన విద్యను బోధించాలి

ఎంపీడీఓ కుసుమ మాధురి

ఆమనగల్లు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఎంపీడీఓ కుసుమ మాధురి అన్నారు. సోమవారం ఆమె మండల పరిధి ఆకుతోటపల్లి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. కొనసాగుతున్న సమ్మెటివ్ పరీక్షను పరిశీలించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారంతో కూడిత ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించారు. వచ్చే వానాకాలం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని, గతంలో కంటే పదివేల మొక్కలను అదనంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ ప్రత్యేక అధికారులు విధిగా గ్రామాల్లో పర్యటించాలన్నారు. ప్రజలకు సరఫరా చేసే నీరు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ పాండు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలల రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

### ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని లయన్ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 45 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో 10మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు పరిక్షిత్ నరేందర్, నాగరాజు, లయన్స్ కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ, పీఆర్‌ఓ పాష, సభ్యులు రమేశ్, యాదయ్య, బాలకృష్ణ, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలను మరువలేం

పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవంలో వక్తలు



ఆమనగల్లు: ఎస్‌ఐ హన్మంతరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్

ఆమనగల్లు/కడ్తాల్: 'శాంతి భద్రతల పరిరక్షలో ప్రాణాలొడ్డి పోరాడిన పోలీసు అమరులను ఈ సమాజం ఎప్పటికీ మరువదు. అమరుల స్ఫూర్తితో పోలీసు ఉద్యోగులు తమ విధి నిర్వహణకు పునరంకితం కావాలి' అని వక్తలు అన్నారు. అమరుల సేవలను మరువలేమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లలో, కూడళ్లలో అమరుల చిత్రపటాలు, స్థూపాల వద్ద పోలీసులు, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

#### ఆమనగల్లులో..

పట్టణంలోని ఠాణాలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలోని దివంగత ఎస్‌ఐ హన్మంతరెడ్డి విగ్రహానికి.. ఎస్‌ఐ వెంకటేశ్, సిబ్బంది, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పోలీసుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు యాదయ్య, బాల్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ, పీఆర్‌ఓ పాష, జిల్లా చైర్మన్‌లు రమేశ్, చంద్రశేఖర్, యాదయ్య, సభ్యులు బాలకృష్ణ, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: యువజన సంఘం ఆధ్వర్యంలో అమరుల స్థూపం వద్ద..



కడ్తాల్: ఠాణాలో..

#### కడ్తాల్‌లో..

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో అమరుల చిత్రపటానికి పోలీసులు నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వరప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.